కొలువుదీరిన వనదేవతలు

బయ్యారం : మండలంలోని నందిమేడారం సమక్క–సారక్క ఆలయం వద్ద గద్దెపై గురువారం వనదేవతలు కొలువుదీరారు. మండలంలోని పలు గ్రామాలతో పాటు గార్ల, డోర్నకల్, కురవి, మహబూబాబాద్, నెల్లికుదురు, భద్రాద్రి జిల్లా ఇల్లందు, గుండాల, టేకులపల్లి, ఖమ్మం జిల్లా కారేపల్లి, కామేపల్లి నుంచి భక్తులు వాహనాల ద్వారా ఆలయం వద్దకు చేరుకున్నారు. రాత్రి సమ్మక్క దేవతను భక్తుల జయజయధ్వానాల నడుమ ఆలయ నిర్వాహకురాలు సాంబలక్ష్మి గద్దెకు తీసుకొచ్చారు. ఇదే విధంగా గంధంపల్లి, కొత్తపేటలోని సమ్మక్క–సారక్క ఆలయాల్లో సైతం దేవతలు గద్దెకు చేరారు.

అలిగేటిలో స్నానాలు.. దేవతలకు బోనాలు

దేవతల దర్శనానికి వచ్చిన భక్తులు అలిగేటిలో పవిత్ర స్నానాలు చేసి తలనీలాలతో పాటు వాగు పక్కనే ఉన్న జంపన్న ఆలయంలో బోనాలు, నిలువెత్తు బంగారంను దేవతలకు సమర్పించారు. కాగా జాతర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

గద్దెకు చేరిన సమ్మక్క

గూడూరు : మండలంలోని దామరవంచ, జగన్నాయకులగూడెం గ్రామాల నడుమ జాతీయ రహదారి పక్కన చింతలగట్టు వట్టివాగు ఒడ్డున గల గద్దెలపైకి, సూర్యునిగుట్ట నుంచి బయలుదేరి సమ్మక్క తల్లి గురువారం రాత్రి చేరుకుంది. ప్రధాన పూజారి దారం సిద్ధు, కమిటీ అధ్యక్షుడు పెనక నాగయ్య బృందం మధ్యాహ్నం సూర్యుడిగుట్టకు చేరుకున్నారు. సాంప్రదాయ పద్ధతిలో సమ్మక్కకు పసుపు, కుంకుమ, ఒడిబియ్యం, వస్త్రాలు దామరవంచ నుంచి తీసుకెళ్లారు. ప్రధాన పూజారి సిద్ధు కుంకుమ భరిణె రూపంలో ఉన్న సమ్మక్కతల్లితో మేళతాళాల నడుమ బయలుదేరారు. ఈ సందర్భంగా శివసత్తుల పూనకాలు, భక్తుల కేరింతలతో జాతర ప్రదేశం మార్మోగింది. ఆలయ ప్రధాన ద్వారం వద్దకు చేరుకున్న సమ్మక్కకు దిష్టి తీసి డోలు వాయిద్యాల నడుమ వడ్డెలు తల్లిని గద్దెకు చేర్చారు. అలాగే ఏపూరు సమీప పాకాలవాగు గబ్బిలాలమడుగు గద్దెలపైకి సమ్మక్క చేరుకుంది.

చల్లని దీవెనలతో ఆశీర్వదించండి: ఎమ్మెల్యే

ప్రజలందరికీ సమ్మక్క–సారలమ్మలు చల్లని దీవెనలతో ఆశీర్వదించాలని ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్ వేడుకున్నారు. మండలంలోని చింతలగట్టు వట్టివాగు సమ్మక్క, ఏపూరు సమీప పాకాల వాగు ఒడ్డున గబ్బిలాలమడుగు సమ్మక్క–సారలమ్మ జాతరలను గురువారం ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా జాతర కమిటీ నిర్వాహకులు డోలు వాయిద్యాలతో స్వాగతం పలికారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా..

ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలకు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్ అన్నారు. మండలంలోని ఏపూరులో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం దామరవంచ గిరిజన గురుకుల పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. గూడూరు తహసీల్దార్ కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందించారు. తహసీల్దార్ శ్వేత, ఎంపీడీఓ వీరస్వామి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు భరత్‌చందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు చిట్టి వెంకన్న, ఎర్ర నరేష్‌రెడ్డి, కొమ్మాలు నాయక్, శివ, మధుగౌడ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

కురవిలో..

కురవి : మండల కేంద్రం శివారు తులిస్యాతండా గ్రామంలో గురువారం సమ్మక్క–సారలమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. తండాకు చెందిన రాములు వెంకన్న ఆధ్వర్యంలో బాదావత్ వెంకన్న పూజారి నేతృత్వంలో వేడుకలను నిర్వహించారు. భక్తులు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. బాదావత్ రాజునాయక్, బాదావత్ వీరన్న పాల్గొన్నారు.

బోనాలు సమర్పించి.. మొక్కుల చెల్లింపు

మరిపెడ రూరల్ : మరిపెడ మండలం వెంకంపాడు గ్రామంలో సమ్మక్క–సారలమ్మ జాతరను గురువారం ఘనంగా జరుపుకున్నారు. డప్పు చప్పుళ్లతో మహిళలు అధిక సంఖ్యలో బోనాలతో పురవీధుల్లో ఊరేగింపుగా గద్దెల వద్దకు బయలుదేరి వెళ్లారు. నిర్వాహకులు, దాత శ్రీను(సమ్మక్క), కవిత దంపతుల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

భక్తుల మొక్కులు..

డోర్నకల్ : మండలంలోని కస్నాతండా గ్రామపంచాయతీ పరిధిలోని సమ్మక్క–సారలమ్మ గుడిలో గురువారం భక్తులు అధిక సంఖ్యలో మొక్కులు చెల్లించుకున్నారు.

భక్తిశ్రద్ధలతో మినీ మేడారం జాతర

గార్ల : మండలంలోని ముల్కనూరు, అంకన్నగూడెం గ్రామాల్లో నిర్వహిస్తున్న మినీమేడారం సమ్మక్క–సారలమ్మ జాతర గురువారం భక్తులతో పోటెత్తింది. సమ్మక్క తల్లి కుంకుమ భరిణెతో గద్దెల మీదికి రావడంతో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి బంగారంతో మొక్కులు తీర్చుకున్నారు.



గార్ల : ముల్కనూరులో గద్దెలపై కొలువుదీరిన సమ్మక్కకు పూజలు చేస్తున్న భక్తులు



గూడూరు: గబ్బిలాలమడుగు జాతరలో పూజ చేస్తున్న ఎమ్మెల్యే



డోర్నకల్: మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



గూడూరు: చింతలగట్టు గద్దెకు వస్తున్న సమ్మక్క



బయ్యారం: పూజలు నిర్వహిస్తున్న భక్తులు



మరిపెడ రూరల్: వెంకంపాడులో బోనాలతో..



కురవి: తులిస్యా తండాలో..

క్లుప్తంగా

పీహెచ్‌సీల తనిఖీ



డోర్నకల్/ బయ్యారం: సాధారణ ప్రసవాలపై అవగాహన కల్పించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ ఆదేశించారు. బయ్యారం పీహెచ్‌సీ, డోర్నకల్ పీహెచ్‌సీని గురువారం ఆయన తనిఖీ చేశారు. ఆస్పత్రిలో వసతులు, రోగులకు అందుతున్న సేవలను పరిశీలించారు. అలాగే స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌ను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదో తరగతి సబ్జెక్టులు బోధించే ఉపాధ్యాయులతో సమావేశమైన అనంతరం తరగతి గదిలో విద్యార్థులతో మాట్లాడారు.

ఆర్థికసాయం



డోర్నకల్ : గుండెజబ్బుతో బాధపడుతున్న గూర్ఖాకు స్థానిక వ్యాపారులు గురువారం ఆర్థిక చేయూతనందించారు. నేపాల్ దేశానికి చెందిన డంబర్ రాణా సుమారు 25 ఏళ్ల క్రితం డోర్నకల్‌కు వచ్చి గూర్ఖాగా జీవనం సాగిస్తున్నాడు. స్థానిక కాంగ్రెస్ నాయకులు మాదా శ్రీనివాస్, శీలం శ్రీనివాస్, సుశీల్‌జైన్, రెడ్డబోయిన శంకర్, ఎడమకంటి రవి, రాధాకృష్ణ, కన్యాలాల్ తదితరులు రూ.50 వేల నగదును రాణాకు అందించారు.

విజయవంతం చేయాలి

నెల్లికుదురు : ఆంధ్ర మాలమహానాడు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించ తలపెట్టిన చలో కాకినాడ సభను విజయవంతం చేయాలని మాల మహానాడు తెలంగాణ రాష్ట్ర పొలిట్ బ్యూరో చైర్మన్ అశోద భాస్కర్ పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



భోజనం చేస్తున్న ఎంపీడీఓ రవికుమార్

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మండలంలోని వీఎస్.లక్ష్మిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎంపీడీఓ బానోత్ రవికుమార్ గురువారం సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలు, ఉపాధ్యాయుల బోధన, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. భోజనం ఎలా ఉందని విద్యార్థులను అడిగి తెలుసుకుని, వారితో కలిసి భోజనం చేశారు. అనంతరం హజార్యతండా, సింగారం, ఇస్లావత్ తండా(ఎస్), జంగిలిగొండ, పర్వతగిరి గ్రామపంచాయతీలను సందర్శించి నర్సరీ, పల్లె ప్రకృతి వనం, డంపింగ్ యార్డు, శ్మశాన వాటిక, అంగన్‌వాడీ సెంటర్లను సందర్శించారు. పంచాయతీ కార్యదర్శులు షకీల్ అహ్మద్, పార్వతి, వీరన్న, మహేష్, ఉమారాణి పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



బహుమతులు అందజేస్తున్న బాధ్యులు

గార్ల : క్రీడలతో శారీరక, మానసికోల్లాసంతో పాటు యువకుల్లో దేహదారుఢ్యం పెంపొందుతుందని పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్, కోరం సురేందర్ అన్నారు. మండలంలోని గుంపెళ్లగూడెంలో నిర్వహించిన ఉమ్మడి ఖమ్మం జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఆయన బహుమతులు అందజేసి మాట్లాడారు. కబడ్డీ పోటీల్లో ఏన్కూరు మండలం నాచారం జట్టు ప్రథమ, ద్వితీయ బయ్యారం, తృతీయ గుంపెళ్లగూడెం, నాల్గోవ బహుమతి కోయగూడెం జట్లు గెలుచుకున్నాయి. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దనియాకుల రామారావు, జిల్లా నాయకుడు గుండా వెంకటరెడ్డి, జాస్తి సాగర్ బాబు, గంగావత్ రాంసింగ్, ఎద్దు లక్ష్మయ్య, బి.సుందర్, కోటేశ్వరరావు, పోటీల నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

‘సేవాలాల్ జయంతి’ని జయప్రదం చేయండి

గార్ల : ఇల్లందులో ఎమ్మెల్యే కోరం కనకయ్య సమక్షంలో ఈనెల 27వ తేదీన ప్రభుత్వం అధికారికంగా నిర్వహించే సద్గురు సేవాలాల్ జయంతి వేడుకలను జయప్రదం చేయాలని ఇల్లందు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ భూక్య నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. గురువారం గార్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ వేడుకకు మండలంలోని మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బంజారాలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో కిషన్, అశోక్, రాంబాబు, బాబులాల్, రాంసింగ్, భాను, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఉపాధిహామీ పనుల్లో అవినీతిమయం

నెల్లికుదురు : ఉపాధిహామీ పథకంలో చేపట్టిన వివిధ రకాల పనుల్లో సుమారు రూ.12లక్షల వరకు అవినీతి జరిగిందని అధికారులు తేల్చారు. స్థానిక రైతు వేదికలో రెండు రోజులుగా ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ గురువారం పూర్తయిందని ఏపీడీ శాంతకుమారి వివరాలు వెల్లడించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో సుమారుగా రూ.12లక్షలవరకు అవినీతి జరిగిందని ఒక్క వస్రాంతండా గ్రామ పంచాయతీలో ఎక్కువ రూ.4లక్షల వరకు అవినీతి ఉందని తెలిపారు. ఎంపీపీ ఎర్రబెల్లి మాధవి, ఎంపీడీఓ శేశాద్రి, ఏపీఓ మాధవి, ఎస్ఆర్‌పీలు రాజు, నర్సయ్య అధికారులు పాల్గొన్నారు.

పలువురికి టీబీ పరీక్షలు

దంతాలపల్లి : మండల కేంద్రంలోని పీహెచ్‌సీ పరిధిలో గురువారం పలువురికి టీబీ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యురాలు చైతన్య మాట్లాడారు. దగ్గు, జ్వరం వారమైన తగ్గకుండా వస్తు, ఛాతీనొప్పి వంటి లక్షణాలు కనిపిస్తే ఆస్పత్రిలో సంప్రదించాలన్నారు. టీబీ సోకిన వారికి భయం అవసరం లేదని మందులు వాడితే తగ్గిపోతుందన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ బాలాజీ, టీబీ నోడల్ ఆఫీసర్ చలపతిరావు, సుజాత, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉన్నాం..

డోర్నకల్ : గ్రామాల్లో జ్వరాలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకుంటు అప్రమత్తంగా ఉన్నామని పీహెచ్‌సీ వైద్యాధికారి సాధ్విజ తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. బూర్గుపాడు గ్రామంలో వారంక్రితం ఐదుగురు జ్వరాలతో బాధపడుతున్నట్లు గుర్తించి, మూడురోజులుగా గ్రామంలో పర్యటించి జ్వర బాధితులకు పరీక్షలు నిర్వహించామన్నారు.

24, 25 తేదీల్లో బొడ్రాయి వార్షికోత్సవం

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ పట్టణంలో ఈ నెల 24, 25వ తేదీల్లో బొడ్రాయి మొదటివార్షికోత్సవం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని మున్సిపల్ చైర్మన్, బొడ్రాయి కమిటీ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రాంమోహన్ రెడ్డి, అర్బన్ కాంగ్రెస్ అధ్యక్షులు, కమిటీ సభ్యులు గణపురపు అంజయ్య, ఎడ్ల రమేష్ అన్నారు. బొడ్రాయి వార్షికోత్సవ నిర్వహణపై పట్టణంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో పట్టణ అన్ని కుల సంఘాల నాయకులు, ప్రజలతో సమావేశం గురువారం నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్, కమిటీ సభ్యుల సహకారంతో కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, అందుకు ఎమ్మెల్యే లక్ష రూపాయలు విరాళం ప్రకటించారన్నారు. నాగేశ్వరరావు, వార్డు కౌన్సిలర్ ఎడ్ల వేణుమాధవ్, ఆకుల హరిప్రసాద్, కౌన్సిలర్, వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బొడ్రాయికి పూజలు

మహబూబాబాద్ పట్టణంలో బొడ్రాయి వార్షికోత్సవంలో భాగంగా ఎమెల్యే మురళీనాయక్, డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

● పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



పెద్దవంగర: శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి తదితరులు

పెద్దవంగర / తొర్రూరు రూరల్: నియోజకవర్గ అభివృద్ధే తమ ధ్యేయమని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. గురువారం పెద్దవంగర మండలంలోని రెడ్డికుంట తండా, చిట్యాల, తొర్రూరు మండలంలోని కంఠాయపాలెం, పెద్దమంగ్యా తండా, భోజ్యతండాలో చేపట్టిన సీసీరోడ్డు పనులను, అలాగే టీక్యాతండాలో రూ.20 లక్షలతో చేపట్టిన నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణాన్ని ప్రారంభించారు. గ్రామాల్లో సీసీ రోడ్డు నిర్మాణ పనులు, రెడ్డికుంట తండాలో నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటామన్నారు. త్వరలో ఇందిరమ్మ గ్రామ కమిటీలు ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈదురు రాజేశ్వరీ, పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్, నాయకులు నిరంజన్‌రెడ్డి, ముద్దసాని సురేష్, నరేందర్‌రెడ్డి, రంగు మురళి, సైదులు, కుమారస్వామి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు చేపట్టాలని వినతి

తొర్రూరు రూరల్ : మండలంలోని ఆయా గ్రామాల్లో నిలిచిపోయిన అభివృద్ధి పనులు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డికి జెడ్పీ ఫ్లోర్ లీడర్ మంగళపల్లి శ్రీనివాస్, ఎంపీపీ తూర్పాటి అంజయ్య గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అప్పటి మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అనేక శాఖల నుంచి సీసీ, మెటల్ రోడ్లు, మహిళల, కులసంఘాల భవనాలు, పాఠశాలల తరగతి గదుల నిర్మాణానికి నిధులను మంజూరు చేయించారన్నారు. నిలిచిపోయినా అభివృద్ధి పనులను వెంటనే చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

కేంద్రప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



మహబూబాబాద్: కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఏఐకేఎంఎస్ నాయకులు

ఢిల్లీలో రైతులపై కేంద్రప్రభుత్వం విచ్చలవిడిగా రబ్బరు బుల్లెట్లు, టియర్ గ్యాస్‌తో విరుచుకపడడం దారుణమని పలువురు ఏఐకేఎంఎస్ నాయకులు అన్నారు. ఇందుకు నిరసనగా అఖిల భారత రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో కేంద్రప్రభుత్వ దిష్టబొమ్మను గురువారం దహనం చేశారు. కాగా అనేక మంది రైతులు గాయపడడంతో పాటు శభకరన్ అనే యువరైతు మృతి చెందడం బాధాకరమన్నారు. పోలీసుల పాశవిక చర్యలకు నిరసనగా సంయుక్త కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గం పిలుపు మేరకు గురువారం ఆయా మండలాల్లో నిరసన తెలిపారు. ఏఐకేఎంఎస్ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు. - సాక్షి నెట్‌వర్క్



బయ్యారం: ఆందోళనలో పాల్గొన్న నాయకులు



కేసముద్రంలో..



మహబూబాబాద్ రూరల్ : మోదీ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న ఏఐకేఎంఎస్ నాయకులు



నెహ్రూసెంటర్ : మాట్లాడుతున్న చిన్న చంద్రన్న



దంతాలపల్లిలో..



గార్లలో ధర్నా చేస్తున్న ఏఐకేఎంఎస్ నాయకులు

ఇళ్ల పట్టాలతో తండావాసుల నిరసన



నిరసన తెలుపుతున్న తండావాసులు

కేసముద్రం : మండలంలోని భుక్యా రాంతండా జీపీ శివారు కాలనీతండాలో గత ప్రభుత్వం తమకు ఇళ్ల పట్టాలిచ్చారంటూ ఓ వ్యక్తి గురువారం ఇంటి నిర్మాణం చేపడుతుండగా రెవెన్యూ అధికారులు అక్కడికి చేరుకుని నిర్మాణాన్ని అడ్డుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. గతంలో 45 మందికి ఇళ్ల పట్టాలిచ్చిందని, ఈమేరకు తండాసమీపంలో ఇంటి నిర్మాణం ప్రారంభించారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ, పోలీస్ అధికారులు అక్కడికి చేరుకుని నిర్మాణాన్ని అడ్డుకున్నారు. దీంతో తండావాసులు తమకు గత ప్రభుత్వం ఇళ్ల పట్టాలిచ్చారని, ఇప్పుడు కావాలనే కాంగ్రెస్ నాయకుల కుట్రతో, అధికారులు ఇంటి నిర్మాణాన్ని అడ్డుకుంటున్నారంటూ పురుగుల మందు డబ్బాతో తండావాసులు నిరసన తెలిపారు. సంఘటన స్థలానికి చేరుకుని ఆందోళనకారులకు నచ్చజెప్పారు. ఈ మేరకు ప్రభుత్వభూమిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దంటూ రెవెన్యూ అధికారులు బోర్డులను ఏర్పాటు చేశారు.

కోర్టు పరిధిలోని భూమి కబ్జా

● చర్య తీసుకోవాలని రైతుల డిమాండ్



నిరసన వ్యక్తం చేస్తున్న బాధిత రైతులు

మరిపెడ రూరల్ : కోర్టు పరిధిలో ఉన్న భూమిని కబ్జా చేసి కంచె వేసిన వ్యక్తిపై చర్యలు తీసుకొని, తమకు న్యాయం చేయాలని బాధిత రైతులు కురియాకుల వీరస్వామి, నారంరెడ్డి వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని అబ్బాయిపాలెం శివారు వివాదస్పద భూమిలో ఏర్పాటు చేసిన కోర్టు హెచ్చరిక బోర్డు వద్ద వారు గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాధిత రైతులు మాట్లాడుతూ.. అబ్బాయిపాలెం గ్రామానికి చెందిన మారంరాజు వెంకటప్పయ్యకు చెందిన సర్వే నంబర్ 405, 406లో సుమారు ఎనిమిది ఎకరాల భూమిని తాము 2018లో కొనుగోలు చేసినట్లు తెలిపారు. తమ వద్ద సదరు భూమికి సంబంధించిన పట్టా పాస్ పుస్తకాలు ఉన్నాయన్నారు. అయినప్పటికీ ఇదే గ్రామానికి చెందిన వంటికొమ్ము సత్యనారాయణరెడ్డి అదే సర్వే నంబర్‌లో ఉన్న బోడ దూప్య, పంతులు, కీర్య, డోల గిరిజన రైతుల వద్ద అక్రమంగా ఐదు ఎకరాలు పట్టా చేయించుకున్నాడు. తాము కొనుగోలు చేసుకున్న భూమి హద్దులను అక్రమం పట్టాలో ఎక్కించుకున్నాడు. ఈ విషయంపై ఘర్షణలు జరిగి కేసులు కావడంతో తాము కోర్టును ఆశ్రయించామన్నారు. కోర్టు పరిధిలో వివాదాస్పదంలో ఉన్నప్పటికి సదరు వ్యక్తి కంచె ఏర్పాటు చేసి ప్లాట్లు చేశాడని బాధిత రైతులు కన్నీటి పర్యాంతమయ్యారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్య తీసుకొని న్యాయం చేయాలని రైతులు వేడుకుంటున్నారు. కురియాకుల వెంకటప్పయ్య, కృష్ణ, బోడ భీమా, బోడ నాగు, జినక ఇద్దయ్య తదితరులు ఉన్నారు.

క్రైం కార్నర్

దాడి కేసులో ఒకరికి జైలు శిక్ష

మరిపెడ /మరిపెడ రూరల్ : దాడిచేసి గాయపర్చిన కేసులో ఓ వ్యక్తికి తొర్రూర్ జూనియర్ సివిల్ జడ్జి సరిత గురువారం ఏడాది జైలు శిక్షతో పాటు రూ.1,000లు జరిమానా విధించినట్లు ఎస్సై ఎస్‌కె.తహెర్ బాబా తెలిపారు.

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి

కురవి : మండలంలోని గుండ్రాతిమడుగు(విలేజి) శివారు పెద్దతండాకు చెందిన గుగులోత్ దేవా(45) ఈనెల 13న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో అతన్ని మహబూబాబాద్ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి కొడుకు సాగర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం పోస్టుమార్టం నిర్వహించినట్లు ఎస్సై గోపి వివరించారు. కాగా అదే తండాకు చెందిన గుగులోత్ వీరు అనే వ్యక్తి వల్లే దేవా పురుగుల మందు తాగి చనిపోయాడని ఆరోపిస్తు గొడవ పడ్డారు. దీంతో మృతదేహాన్ని మహబూబాబాద్ జనరల్ ఆస్పత్రి మార్చురిలో భద్రపరిచినట్లు ఎస్సై వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు

నెల్లికుదురు : సూర్యాపేట జిల్లాకు చెందిన ముగ్గురు యువకులు గురువారం ద్విచక్రవాహనంపై నెల్లికుదురు మండలంలోని ఓ శుభకార్యానికి వెళ్లి తిరుగు ప్రయాణంలో మండలంలోని బ్రాహ్మణకొత్తపల్లి చెరువు కట్టపై ఉన్న విద్యుత్ స్తంభానికి ఢీకొన్నారు. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా ఒకరికి స్వల్పగాయపడ్డాడు. చికిత్స నిమిత్తం మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ముగ్గురు మద్యం మత్తులో ఉన్నారని వివరాలు తెలియాల్సి ఉంది.

మరో ఘటనలో..

బయ్యారం : రోడ్డు ప్రమాదంలో సమ్మక్క భక్తుడికి తీవ్రగాయాలైన సంఘటన గురువారం రాత్రి మండలంలోని సంతులాల్‌పోడుతండా వద్ద చోటు చేసుకుంది. మహబూబాబాద్ పట్టణంలోని పత్తిపాకకు చెందిన ఇడుపుగొండ అనిల్ తన సోదరితో కలిసి గంధంపల్లిలోని సమ్మక్క జాతరకు బైక్‌పై వచ్చాడు. దర్శన అనంతరం తిరుగు ప్రయాణంలో బైక్ అదుపుతప్పి కిందపడటంతో తీవ్రంగా గాయపడ్డాడు.

కేసు నమోదు

దంతాలపల్లి : మండల కేంద్రంలో వేధింపుల కేసు నమోదైన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఓ గ్రామానికి చెందిన వివాహితను అదే గ్రామానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ చెంచల వెంకన్న తనను కొన్ని రోజులుగా కోరిక తీర్చమని వేధిస్తున్నాడని బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కరుణాకర్ తెలిపారు.

16 క్వింటాళ్ల నల్లబెల్లం స్వాధీనం

గార్ల : మండలంలోని మర్రిగూడెం క్రాస్ వద్ద గురువారం పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా మరిపెడ గ్రామానికి చెందిన సుంకరి శ్రీకాంత్, గూడెల్లి రఘు బొలేరోలో అక్రమంగా 16 క్వింటాళ్ల నల్లబెల్లం, క్వింటా పటికను తరలిస్తూ పోలీసులకు పట్టుబడ్డారు. హెడ్ కానిస్టేబుల్ జయరాజు ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జీనత్‌కుమార్ తెలిపారు. ఈ దాడుల్లో పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.